క్లుప్తంగా

తొలిరోజు 75 శాతం పింఛన్ల పంపిణీ



కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందిస్తున్న వలంటీర్ వరలక్ష్మి

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే అన్ని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేశారు. మండలంలో 12841 పింఛన్లకు 9307 మొదటిరోజు పంపిణీ చేశారు. సుమారు 75 శాతం పంపిణీ జరిగినట్లు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా పున్నమి చవితి వేడుకలు

పెద్దాపురం: పున్నమి చవితి వేడుకలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే కుటుంబ సమేతంగా పొలాలకు వెళ్లి పుట్టల్లో ఆవుపాలు పోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక మాసంలో వచ్చే ఈ పున్నమి చవితితో పాటు, చాలామంది కార్తిక వన సమారాధనలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

స్వచ్ఛ భారత్‌కు సహకరించాలి

పెద్దాపురం: ప్రజలు స్వచ్ఛభారత్‌కు సహకరించాలని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర కోరారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దాపురం ఎన్టీఆర్ నగర్‌లో ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమన్నారు. పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య సిబ్బంది ఎన్టీఆర్ నగర్‌లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చారు.

నేడు, రేపు ఓటర్ల స్పెషల్ డ్రైవ్

సామర్లకోట: ఓటర్ల జాబితాల్లో తప్పులను సవరించుకోవడానికి శని, ఆదివారాల్లో ఓటర్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఓటరు లిస్టులో పేర్లు లేకపోయినా, నమోదు చేస్తారని తెలిపారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటరుగా చేరుస్తారని పేర్కొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

సామర్లకోట: విద్యార్థి దశ నుంచి దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన ఉండాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్య జీవనం సాధ్యమవుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉపాధ్యాయులు కె.శ్రీనివాసు, వి.రాజు, సీహెచ్ లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో వన సమారాధన

సామర్లకోట: పాత సామర్లకోటలోటున్న బాలా త్రిపుర సుందరీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తిక వనసమారాధన ఏర్పాటు చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. స్వామివారిని, అమ్మవార్లను ఆయన దర్శించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు. ఈ సందర్భంగా దొరబాబును ఆలయ కమిటీ నాయకులు సత్కరించారు.

ప్రజలకు శుభ పరిణామం క్రీస్తు జననం



విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న దైవజనులు

పెద్దాపురం: యావత్ ప్రపంచానికి క్రీస్తు జననం శుభ పరిణామమని ఉజ్జీవ ప్రసంగీకులు అభిషేక్, క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం అన్నారు. క్రిస్మస్ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజామున తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో తొలి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మందిరం నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వారు ప్రసంగించారు. క్రిస్మస్ అంటే కేవలం వేషధారణ సంబరం కాదని, అసలైన క్రీస్తును ఆరాధించడమేనన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను సండే స్కూల్ విద్యార్థులతో కట్ చేయించారు. శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు పాల్గొన్నారు.

మేలు చేసే వారిని గుర్తించండి

'వై ఏపీ నీడ్స్ జగన్'లో దవులూరి దొరబాబు



పవరలో పథకాల బోర్డును ఆవిష్కరించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: ఏ ప్రభుత్వంలో, ఎవరి వల్ల మంచి జరిగిందో ప్రజలు ఆలోచించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం సచివాలయం–12 పరిధిలోని కొత్తూరులో ఏర్పాటు చేసిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో జరిగిన మేలును వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని పెద్దాపురం నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెద్దాపురం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి ప్రకటించారని, 40 ఏళ్ల తర్వాత స్థానికుడైన తనకు అవకాశం వచ్చిందని తెలిపారు. తొలుత పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, స్వయంభారపు వీరభద్రరావు, యార్లగడ్డ జగదష్, సేపెని సురేష్, పితాని కృష్ణ, గుబ్బల సత్యనారాయణ, గృహసారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, పార్టీ నాయకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పథకాలు అమలు

సామర్లకోట: ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, దేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పవర గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు, సర్పంచ్ వీరంరెడ్డి సీతామహాలక్ష్మి, గ్రామ నాయకుడు వీరంరెడ్డి ఆనంద్, ఎంపీటీసీ నాగనబోయిన చంటి ఆధ్వర్యంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి దొరబాబు మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణమాఫీ నాలుగు దఫాల్లో అమలు చేస్తానని చెప్పి, ఇప్పటికే మూడుసార్లు అందజేసినట్టు పేర్కొన్నారు. చేయూతను మూడుసార్లు ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజల కోసమే నిరంతరం పని చేస్తున్నారనడానికి ఇది నిదర్శనమన్నారు. కాపునేస్తం, బీసీ నేస్తం, ఈబీసీ నేస్తం పథకాలను ఆర్థికంగా వెనుకబడిన వారిని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నారని చెప్పారు. తొలుత పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు అధ్యక్షత వహించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ పేర్పిడి వెంకట్రాయుడు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మండపాక సురేష్, పార్టీ సీనియర్ నాయకులు ఎలిశెట్టి నరేష్, తలారి దొరబాబు, జేసీవీ కన్వీనర్ ఉటా వాసు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలూ నెరవేర్చారు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పల్లె నిద్ర చేశారు. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, జగన్ చేస్తున్న అభివృద్ధి బేరీజు వేసుకోవాలని ఆయన అన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అడ్వైజర్ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమ్మిడి చిన్న, తిత్తి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నపై జనంలో రెట్టింపు నమ్మకం

కొత్తపల్లి: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉన్న నమ్మకం మరింత రెట్టింపు అయ్యిందని జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని పొన్నాడ సచివాలయం–2లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. పొన్నాడ సెంటర్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పొన్నాడలో అభివృద్ధి, సంక్షేమ బోర్డులను ఆవిష్కరిస్తున్న నాయకులు



పొన్నాడలో పల్లెనిద్ర చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగన్‌ను గెలిపిస్తే.. రాష్ట్రం మరింత అభివృద్ధి

పెద్దాపురం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తే.. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పులిమేరు గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సభకు పార్టీ గ్రామ ఇన్‌చార్జి బోనాసు గుర్రాజు అధ్యక్షత వహించారు. దొరబాబు మాట్లాడుతూ ప్రజలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని గుర్తించి, రెండో దఫా వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని కోరారు. రెండోసారి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. తొలుత పార్టీ జెండా, పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, ఎద్దు కుమార్, మలపరెడ్డి లోవ, లక్కాకుల కృష్ణ, దాడి చంటి, బాబి, తుమ్మల సూర్యకృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

రబీ ప్రణాళికాబద్ధంగా సాగాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమార్



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమార్

పిఠాపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో జాగ్రత్తలు పాటించి సాగునీటి ఎద్దడి రాకుండా సహకరించాలని, ప్రణాళికా బద్ధంగా రబీ సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్ విజయకుమార్ రైతులకు విజ్ఞప్తి చేసారు. పిఠాపురం మండలం మంగితుర్తిలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు రబీ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఏలేరు ప్రాజెక్టు, పీబీసీలలో నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున ఈ ఏడాది రబీ పంటలకు నియోజకవర్గంలో ఏలేరు, పీబీసీ ఆయకట్టు భూములకు రబీకి సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రణాళిక ప్రకారం సాగు చేయాలన్నారు. ఏలేరు ప్రాజెక్టులో నీటి పరిమాణం తక్కువగా ఉన్నందున భవిష్యత్తులో సాగు నీటి ఎద్దడి రాకుండా రైతులు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలన్నారు. స్వల్ప కాలిక రకాలైన ఎంటీయూ 1123 ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలతో పాటు ప్రైయివేటు రకాలైన ఎంటీయూ 3626 బొండాలు వంటి రకాలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఐదో తేదీ లోపు నారుమళ్లు, నాట్లు వేయడం వంద శాతం పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. నీరు అందని మెరక పొలాలు ఉంటే వాటిలో వరికి బదులు వాణిజ్య పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.స్వాతి, పిఠాపురం వ్యవసాయ శాఖాధికారి అచ్యుతరావు, కసిరెడ్డి బాబూరావు, పేకేటి బాబు, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆయన పిఠాపురం మండలం కుమారపురంలో ఇప్పటికే వేసిన నారుమళ్లను పరిశీలించారు. రెండు రోజుల్లో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున కళ్లాల్లో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని ధాన్యంను సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకోవాలని ఆయన సూచించారు.

సంక్షేమ పథకాలే విజయానికి నాంది

పాదయాత్రలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



తిరుపతికి పాదయాత్రగా వెలుతున్న దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి నాంది పలుకుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ఏడు పర్యాయాల పాటు నిర్వహించే పాదయాత్రలో భాగంగా మూడో రోజు శుక్రవారం నిర్వహించిన పాదయాత్ర సామర్లకోట నుంచి పెద్దాపురం మండలం తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి సుమారు 15 కి.మీ. కొనసాగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సామర్లకోట వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఇనకొండ వీర విష్ణుచక్రం, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి పాదయాత్రను కొనసాగించారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, వేద పండితులు, ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసేవలో మరో 20 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలంటూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దూది రాజు, సర్పంచ్‌లు ఒబిలిశెట్టి అబ్బాయి, ఉప సర్పంచ్‌లు జోకా నానాజీ, వాసిరెడ్డి శ్రీనివాస్, తుమ్మల అచ్యుతరామయ్య, లక్కాకుల కృష్ణ, నాగబోయిన రాజుబాబు, నరాలశెట్టి త్రినాథ్, నేతల హరిబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్, వల్లూరి కుట్టయ్య చౌదరి, ఒబిలిశెట్టి ఆనందం, కాశీవిశ్వనాథ్, నమ్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



తాటిపర్తిలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల సిబ్బంది

- నేడు, రేపు ఓటర్ల క్రమబద్ధీకరణ
- ఎన్నికల అధికారి సుబ్బారావు

పిఠాపురం: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి నియోజకవర్గంలో ఓటర్లకు ఈవీఎంలు వీవీ ప్యాట్‌ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పిఠాపురం ఎన్నికల అధికారి కె.సుబ్బారావు ఆధ్వర్యంలో ఈవీఎంలు వీవీప్యాట్‌లను ఓటర్లకు చూపించి అవి ఎలా పని చేస్తాయి, వాటిని ఎలా ఉపయోగించాలో వివరించారు. నియోజకవర్గంలో 242 పోలింగ్ స్టేషన్ల పరిధిలో గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఈకార్యక్రమం నిర్వహించనున్న అధికారులు తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఓటర్లకు అవగాహన కల్పించారు. పిఠాపురంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పరిసర వార్డు సచివాలయాల వద్ద ఓటర్లకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు 3 నెలల పాటు నిర్వహిస్తామని సుబ్బారావు తెలిపారు. శని, ఆదివారాల్లో నియోజకవర్గ పరిధిలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్‌ఓలు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటర్ల క్రమబద్ధీకరణ చేయనున్నట్లు సుబ్బారావు తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్లు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేయించుకోవచ్చని ఆయన తెలిపారు.

పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసిన వారికోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ధ్వజ స్తంభం వద్ద దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, అర్చకులు ఆకాశ దీపం వెలిగించారు. అనంతరం జ్యోతిర్లింగార్చన చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం



మూలపేటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. మూలపేటలో సచివాలయం వద్ద శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 17 సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా రూ.5 లక్షల వరకూ చికిత్స పొందవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు పౌష్టికాహారంతో పాటు చిన్నారులకు, గర్భిణులకు ప్రతీ నెల 9వ తేదీన పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉన్న పథకాలను రైతులకు వివరించవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్, వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి
'ఆడుదాం ఆంధ్రా'



సామర్లకోటలో సచివాలయ సిబ్బందికి ఆటల కిట్లను అందజేసిన చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు



కాండ్రకోటలో క్రీడా మైదానం పనులను పరిశీలిస్తున్న రాజశేఖర్

మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో సచివాలయ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయంలో రెండు జట్లు పాల్గొనేలా చూడాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్, రింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యువతీయువకులు 15 ఏళ్లు దాటినవారు అర్హులని, ఈ నెల 13లోగా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు సుమారు 50 రోజుల పాటు సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయని చెప్పారు. ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికల కోసం క్రీడాకారులను తయారు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు. సచివాలయ పరిధిలో ఆటల పోటీలకు కిట్లను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో భాగస్వాములు కండి

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 15 నుంచి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మండలానికి చెందిన యువత భాగస్వాములు కావాలని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి కాండ్రకోట గ్రామంలో శుక్రవారం క్రీడా మైదాన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామీణ యువత తమ ప్రతిభ చూపి.. రాష్ట్ర స్థాయిలో పెద్దాపురానికి గుర్తింపు తేవాలని కోరారు. అనంతరం కాండ్రకోట, పులిమేరు, దివిలి పంచాయతీ కార్యాలయాల్లో ఆడుదాం ఆంధ్రాపై సమీక్ష నిర్వహించారు. కాండ్రకోట విద్యా కమిటీ చైర్మన్ వీరబాబు, పంచాయతీ కార్యదర్శులు బషీర్, బ్రహ్మం, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



పిఠాపురంలో రెడ్ రిబ్బన్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు



పెద్దాపురంలో ఎయిడ్స్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

పెద్దాపురం: ప్రతిఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి సభ్యుడు ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాస్, వైజ్ సంస్థ పీఎం రాజు, ఆదిత్య కళాశాల ఫార్మసీ విద్యార్థుల సంయుక్తాధ్వర్యంలో ఎయిడ్స్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్డీఓ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించగా, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు ఎయిడ్స్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరికీ హెచ్ఐవీపై కనీస అవగాహన ఉన్నప్పటికీ, ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పౌష్టికాహారం, న్యాయ సలహాలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయశేఖర్, ఏ.శ్రీనివాస్, ఆనూషరాయ్, మానవ హక్కుల సంఘం నాయకులు నూతాటి అప్పలకొండ, బీఎస్ మూర్తి, వైజ్ సంస్థ పీడీ దేవి, పీఎం డి.రాజు, జార్జిముల్లార్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

పిఠాపురం: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి సుభాషిణి అధ్యక్షతన రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎయిడ్స్ నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి.అహ్మద్ ఆలీబాబా, అధ్యాపకులు ఉషశ్రీ, యూవిబీబీ కృష్ణప్రసాద్ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో..

పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ వి.కామేశ్వరరావు అధ్యక్షతన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, కె.శారద, బి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీవీ కాశీవిశ్వనాథం, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

డీఎస్పీ లతాకుమారి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: యువతి, యువకులకు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన అవసరమని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రగతి మహిళా డిగ్రీ కళాశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎన్ పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ ఆటోలు, బస్సుల్లో మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి, గ్రామాల్లో పెద్దలనూ అప్రమత్తం చేయాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో కొత్త వ్యక్తులను నమ్మరాదని, అనుమానిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. బహుమతులు, లాటరీలు వచ్చాయంటూ సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. అటువంటి వారి మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు సీతాదేవి, నాగమణి, అనూరాధ, విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్ హిమబిందు, ప్రిన్సిపాల్ జి.నరేష్, ఏఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.